పట్టుకుంటుంది... ఎలాగంటారా? ఐ టెల్యూ దొడ్లోకి రండి... అక్కడ వెన్నెల బాగానే వుంటుంది. రాగికాగు వదిలేస్తే అది తాతల నాటిది... మన ప్రాచీన సంస్కృతి అంతా దొడ్లో మర్చిపోయినట్లు ఫీలింగు వస్తుంది. ఆ కాగు మూల పిల్లి పిల్లల్నిపెట్టింది. ఇప్పుడక్కడికి వెళ్తే అది మీదపడి గుడ్లు పీకుతుందేమోనని నాకు భయం... లేకపోతే నేను మిమ్మల్ని బతిమాలేదాన్నా - అవునండీ మొన్న జీడిపప్పు అరకేజి తెప్పించి హార్లిక్స్ సీసాలో పోసి పైన విషం అని రాసేను గదా అంతా మీరే తిన్నారూ... నాక్కొంచెం అన్నా మిగల్చకుండా - అయితే స్వీట్సు అని రాసిన డబ్బాలో చింతపండుంది. అది కూడా తినండి. నా షేర్ కూడా తినేసినందుకు ఈ కాగు యింట్లో పెట్టేశాక వెళ్ళి కారప్పూస కొనుక్కురండి సైకిలు మీద - లైటు లేదా... ఐడోంట్ కేర్... మళ్ళీ ఆ పోలీసుకు దండంపెట్టి వెళ్లి నాకు కారప్పూస తెస్తారా లేదా? వాకింగ్ ఈజ్ బెస్ట్..? కారప్పూస అంటే వుత్తి కారప్పూస పట్టుకొచ్చేరు తెలుగు మాష్టార్లా. కారప్పూస ఫాలోడ్ బై చేగోడీస్ అండ్ పకోడీస్... కాగు తీసుకొచ్చి యింట్లో పెడితేనే చివర్లీ... మీరు తెస్తారా లేకపోతే మీ మీద కంప్లెయింట్ బుక్‌లో రాయమంటారా?

# పతిభక్తి రంజని

నాలుగడుగులేసి యింకెంత దూరవండి - అన్నానుట ఏడుపు మొహం పెట్టి... యింటి కొచ్చాక గొప్పగా చెప్తూతూ నవ్వడం ఆరంభించారు. అప్పుడు "నోర్ముయ్ రాస్కెల్" అని మా మావయ్య గారు తిట్టాక నిర్ఘుంగా నోర్మూసుకుని కుక్కిన పేనులా గదిలోకి పోయి దాక్కున్నారు నా స్టూడెంటు మొగుడుగారు. "ఓపలేని పిల్లను అలా రోడ్లంట తిప్పకూడదురా! వొద్దువొద్దని మా అత్తయ్య వార్నింగు యిచ్చినా వినకుండా కుర్రతనపు సరదాకొద్దీ, మా వారు నన్నోమారు వైజాగ్‌లో బీచొడ్డు, సిన్మాకు - జేబులో "టూ అండ్ ఫ్రో" సరిపడే డబ్బులున్నాయోలేవో చూసుగోకుండా నడిపించుకు తీసుకెళ్ళారు. లవ్విజ్ బ్లైండు కదా - అందుకని నేను కూడా తోకలా పతిభక్తిరంజనిలా నడుచుకుంటూ వెళ్ళాను.

ఆ నైటుకే నా కాళ్ళు పొత్రాల్లావాచి పోట్లూ సలుపులూనూ, నేను ఏడుస్తూ కూర్చుంటే "బొండాం - బొండాం" అని వెక్కిరించడం మొదలెట్టారు. యూకలిప్టసాయిల్ తెప్పించి కాళ్ళకు రాసుకుని కాపడం పెట్టుకుపడుకున్నాను. నీ పతిభక్తి ఏడిసినట్లే ఉందని వాడితో తిరగొద్దని చెప్పానా? అని మా అత్తయ్య కేకలేసింది. అఫ్‌కోర్సు తిరగనని మాటిచ్చాను. భక్తి- పతిభక్తి ప్రదర్శించడానికిగాని, నిజంగా తు.చ. తప్పకుండా ఫాలో అయితే పిట్‌ఫాల్స్ తప్పవని నాకేనాడో తెలిసింది. మొగుడు వెనక్కాల అరణ్యాల్లోకి వెళ్ళడవంటే పిక్నిక్కుకు వెళ్ళడవనుకుంది రామాయణంలో సీత.

అరణ్యవాసానికి అయోధ్యను వదలి వెళ్తూ గబగబా మూడు నాలుగు అడుగులు వేసి "ఇంకా ఎంతదూరం నడవాలి" అని రాముడ్ని పదేపదే అడగడం మొదలెట్టిందట శిరీషకుసుమకోమలి సీత. అలా అడగగానే శ్రీరాముడి కళ్ళంట నీళ్ళు తిరిగాయట. మావారు శ్రీరాముడంత హైక్లాసు ఆద్మీ కాకపోవడం వలన, స్టూడెంటు గుణంకొద్దీ "ఇహ్హిహీ" అని వెక్కిరించారు కాని నన్నలా అవస్థపెట్టి తిప్పడం అమానుషవని వారికి తెలీదు. వాళ్ల సరదాయే వాళ్ళకు గాని, ఆడదాన్ని సరదాకోసమైనా కష్టమెట్టకూడదని మగాళ్ళకి, అందులో కుర్రాళ్ళకి అసల్తెలీదు. మిఠాయుండ చేత్తో పట్టుకు కొరుక్కు తింటూ తిరిగే స్కూలు పిల్లాడి మనస్తత్వమే పెళ్ళయిన కుర్రాళ్ళది. అందుకే కాస్త పెద్దాళ్ళు అడపాదడపా చిన్న చిన్న చురకలు తగిలిస్తూంటే కాని దారిన పడరు. వయసూ సొగసూ వలపులూ తలపులూ అలా పరిగెట్టిస్తూంటే, ప్రేమకి కళ్ళెం తలుపుకి గొళ్ళెంలా పడాలి. పడకపోతే... బ్లండర్సు జరుగుతాయి. పెళ్ళయిన కొత్త కోడలికి మొగుడు చెప్పినట్టు వినడవా, పెద్దవాళ్ళు చెప్పినట్టు వినడవా అనే డైలమా అడుగడుగునా వొస్తూవుంటుంది. డైలమాలో పడ్డప్పుడు సరిగా తప్పించుకోకపోతే దలైలామా పడ్డ అవస్థలో పడాలిసొస్తుంది.

"తనువామెది సుందరం, మనసామెది సున్నితం" అని పెళ్ళి కొడుకులందరికీ తెలీదు. మగాడు సిగ్గుపడకుండా మొండిగా బండగా వ్యవహరించగలడు. వెంటాడి వేటాడే స్వభావం కదా వాడిది. ఆడది పంజరంలో చిలక... చిలక్కి పంజరం ఆట్టే బాగుండదేమోకాని, చాలామంది ఆడాళ్ళకు బంగారు పంజరాలే శరణ్యం, మంచివీకూడాను. పంజరంలో వుండాలంటే పతిభక్తి వుండాల్సిందే... ప్రాచీన కల్చరో దర్టీకల్చరో ఏదో ఒహటి... మన ఆడాళ్ళ దగ్గరే యింకా కొంత కల్చర్ మిగిలి వుంది. మగాళ్ళు నీతిబీరకాయలే...

"అవసరార్థం అక్షతాం సమర్పయామి" అంటారు. కాని మనసు దాచుకోలేని కోర్కెల్ని చంపుకోలేని ఆడది "పతిభక్తిరంజని"గా తయారవుతుంది. కొంతమంది వెర్రిపెళ్ళాలుంటారు (చాసోగారి 'ఏకరువు' కథలోలాగ)- అంటేవెర్రి- పెళ్లానికి కాదు- మొగుడంటే వెర్రి వ్యామోహం వాళ్ళకు. మొగుడందగాడైతే కాస్త, యిహవాళ్ళ వాపిరిగొట్టుతనానికి హద్దూపద్దూ వుండదు. నిజవైన గొప్ప పతివ్రతలు పతిభక్తిశ్రీరంజనీలు వీళ్ళే... మొగుడికి మెళ్ళో నగలన్నీ బంగారుగాజుల్తో సహా తీసి యిచ్చేస్తారు. (పేకాటకి, తాగుడికి, ముండలికి)- కట్టుకున్న కోకనైనా అమ్మి మొగుడి సరదాలు తీరుస్తారు.

మొగుడు తంతూంటే కిక్కురుమనకుండా తిని- భోంచేసి వెళ్ళమని కాళ్ళమీదపడి బ్రతిమాలుకుంటారు. పసుపూ కుంకుమల సెంటిమెంట్ల ముద్దలులాగుంటారు. వారు చేసిపెట్టినది తినకపోతే వారి సేవల్ను అంగీకరించకపోతే తల పగలగొట్టుకు చస్తారు. కాని బయట అడ్డవైన తిరుగుళ్లు తిరిగే మగాళ్ళను వీళ్ళు లాలించి గారాలు మప్పి పాడుచేస్తారు. చెడ్డ పెళ్ళానితో పడే బాధకంటె మంచి పెళ్ళాంతో పడే బాధ (పోలీసువాడి దెబ్బలా) పైకి కనపడని గాయం- మంచి పెళ్లాలు కార్టూన్లకు కూడా దొరకరు. నీళ్ళలో నానడం, మడికట్టుకోడాలూ, పూజలూ, వుపవాసాలూ, భజనల్తో పతిభక్తిరంజనీలు లైఫ్‌ను లాగేస్తూంటారు.

కొందరాడావాళ్ళుంటారు. వాళ్ళు గోపికల్లాగ రాధల్లాగ ఊర్వశుల్లాగ వుండనే వుండరు. వాళ్ళు కథానాయికల్లా పైకికనబడరు. చూస్తేఏ మనోవికారం కలగ్కపోగా "ఆడా-మగా" తేడా తెలుసుకోవడం కష్టం- చీర కట్టుకుంటే "అయ్యో చీర అందవంతా పాడుచేశారే" అనిపిస్తుంది. నగలు పెట్టుకుంటే 'అమ్మవార్ల'లాగుంటారు. కాని అలాంటి అమ్మలనే లక్ష్మీ సరస్వతులు వెళ్ళి వరించాయా అనిపిస్తుంది. మొగుళ్ళను సుఖపెట్టేదిఈ అమాయకపు స్త్రీలే. పిల్లల్ని మెడకు కట్టుకుని వీపుల మీద మోసి పెంచి పెద్దచేసేది ఈ జనవే. వంటింటి మహాలక్ష్మిల్లాంటి ఈ అత్తయ్యలు పెద్దమ్మలు వదినెలు అక్కయ్యలేలేకపోతే, వాళ్ళకు తమ మొగుళ్ళమీద, పిల్లలూ, సంసారాల మీద యింతింత చెప్పడానికి వీలులేనంత వెర్రి వ్యామోహాలు కలక్కపోతే... మన సివిలిజేషన్లు డొల్ల... ఇక భవితవ్యముకల్ల...అన్నమాట నిజమవుతుంది. అంచాత మిలట్రీ స్ట్రీటజీ ప్రకారం జీవిత సమరంలో మగాళ్లు వీరవిక్రమ రూపాల్ని ధరించి అరివీర భయంకరంగా పోరాడి విజయలక్ష్మిని సాధించాలంటే "యింట గెలచి రచ్చ గెలవాలికదా!" హోం ఫ్రంటుని తీర్చిదిద్దే ఈఆడాళ్లు - ఈ నిశ్శబ్ద సంపుటాలు, ఈ సైలెంట్ సోల్జర్లు మనకెక్కడి కెళ్ళినా శ్రీరామరక్ష కలిగిస్తారు. పెళ్ళాంలోతల్లి దాక్కొనుంటుంది. అందుకే ఆ మహాతల్లి చెప్పినట్లు నడుచుకోవడం బెస్టు... పెళ్ళాంలోని తల్లికీ తల్లిలోని తల్లికీ సరిపడదు లోకంలో.

పెళ్ళాం చెప్పినట్లు మొగుడు వినాలా, మొగుడు చెప్పినట్లు పెళ్ళాం వినాలా? పెద్దవాళ్ళు చెప్పినట్లు కుర్రాళ్లు నడుచుకోవాలా, కుర్రాళ్ళు వినాలా? హోంఫ్రంటుని బాధిస్తున్న ఈ క్రొశ్నలు ఎటర్నల్ క్వశ్చన్స్ "వినదగు నెవ్వరు చెప్పిన వినినంతనె వేగపడక వివరింపదగున్" అన్నాడు సుమతీ శతకకారుడు. ఒరులేయవి యొనరించిన నరవర అప్రియము తన మనంబున కగు దా నొరులకవి సేయకునికి పరాయణము పరమధర్మ పథములకెల్లన్" అన్నాడు విదురుడు. బైబిల్లో కూడా ఈ ముక్కలే తిరగేసి చెప్పారు. కనుక ఓ కోడలు పిల్లా "నీ కితరులు ఎలా చేయాలను కుంటావో నీవు ఇతరులకు అలా చెయ్యి." అలాగే ఓ అత్తగారూ "మీకు యితరులు ఎలా చేస్తే అయిష్టమో అటువంటివి మీరు యితరులకి చెయ్యకుండా వుండండి." దట్సాల్-దేర్ ఎండ్స్ ది మేటర్... ఓ మొగుడుగారూ... మీరే ఓ పదహారు పదిహేడేళ్ళు వున్న అమ్మాయి ననుకుని, కడుపుతో వున్న పతిభక్తి రంజనిననుకొని మిమ్మల్ని పై పేరాలో నేనున్న స్థితిలో వూహించుకోమంటే "ఇహ్హిహీ- యిదినడవ లేక వెనుకబడ్తోంది" అని దెప్పడం కాదు. అప్పుడు మీకే తెలిసివస్తుంది. పెళ్ళాం "సైకో-అనాలిసిస్". ఇందు మూలముగా తెలియజెప్పే నీతి ఏమనగా "అనవసరంగా అమ్మాయిలను వెంటేసుకుని రోడ్లమీద త్రిప్పకూడదు."

ఇంటికి దీపం ఇల్లాలైతే, వీధిలోకి లాంతరు స్తంభం మగాడు... అటువంటి లాంతరు స్తంభంగారూ, లేడీ డాక్టరు చేత తిట్లుతినకండి. బ్రేవో... బిహేవ్ వెల్ మైగుడ్ బోయ్. పెళ్ళాం పతిభక్తి రంజనికదా అని, అడ్డమైనచోట్లకూ తిప్పకూడదు... రామాయణం జ్ఞాపకం చేసుకోండి. రావణాసురులు ఏకాలంలోనూ వుంటారు. మీరు రాముడిలా యుద్ధం చేయలేరు కనుక, సీతల్ని కష్టపెట్టకండి.